

'క్లబ్ 10 చికెన్' ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

'క్లబ్ 10 చికెన్' తన మూడో బ్రాంచిని తిరుపతిలో శుక్రవారం ఏర్పాటు చేసింది. స్థానిక అన్నమయ్య సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన బ్రాంచిని తిరుపతి కార్పొరేటర్ ఎస్కె.బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల చికెన్ ఐటెమ్స్ రుచికరంగా, తాజాగా ఇక్కడ అందిస్తారన్నారు. యువతకు, మహిళలకు, పిల్లలతో పాటు అన్ని రకాల వయస్సు వారికి నచ్చే రుచులలో ఆహార పదార్థాలు ఇక్కడ లభిస్తాయన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్ మురళీ, ప్రొప్రైటర్ ప్రదీప్, తాళ్లూరు ప్రసాద్, రంజిత్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. వరికి నష్టం..!



తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

ప్రజాశక్తి - వి.కోట/దొరవారిసత్రం

చిత్తూరు జిల్లా వి.కోట మండల పరిధిలో గురువారం రాత్రి గాలీ, వడగళ్లవాన బీభత్సం సృష్టించింది. దీంతో రైతులు భారీగా నష్టపోయారు. వెంకటేపల్లి, కొమ్మరమడుగు, కృష్ణాపురం తదితర గ్రామాల్లో కాకర, టమోటా, అరటి, చిక్కుడు, బీన్స్ పంటలు, పిందె దశలోని మామిడికాయలు గాలి తీవ్రతకు నేలకొరిగాయి. పలు ఉద్యానపంటలు కోత దశలు నేలమట్టమయ్యాయి. మండల పరిధిలో దాదాపు 10 లక్షలపైనే పంట నష్టం సంభవించి ఉంటుందని రైతులు వాపోతున్నారు. అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బలంగా వీచిన ఈదురుగాలులకు వి.కోట 6 పలమనేరు జాతీయ రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ రాంభూపాల్ సిబ్బందితో వెళ్లి అడ్డంగా పడి ఉన్న చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పిడుగుపడి ఆవు మృతి

దొరవారిసత్రం : తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలోని సింగనాలతూరులో శుక్రవారం ఉరుములు మెరుపులతో కురిసిన అకాల వర్షానికి పిడుగు పడడంతో ఆవు మృతి చెందింది. వివరాల మేరకు అదే గ్రామానికి చెందిన పాసాల సుబ్రహ్మణ్యం ఆవు మేత కోసం పంట పొలాల్లోకి వెళ్లింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు రావడంతో ఆ పంట పొలాల్లో పిడుగు పడడంతో మేతమేస్తున్న ఆవు అక్కడకక్కడే మతి చెందింది. వర్షం ఉరుములు తగ్గిన తర్వాత గ్రామస్తులు చూసి ఆవు యజమానికి తెలపడంతో సుబ్రమన్యం లబోదిబోమన్నాడు. ఈ ఆవును ఇటీవల అప్పుచేసి మరీ కొన్నానని, చనిపోవడంతో నష్టం వాటిల్లిందని వాపోయాడు.

బైరెడ్డిపల్లిలో... వడగళ్ల వానకు జిల్లా పరిషత్ పాఠశాలలోని పెద్ద చెట్టు కూలిపోయింది. పాఠశాల పేరు ఉన్న బోర్డు నేలమట్టమయ్యింది. పుంగనూరు వెంగమారిపల్లి జాతీయ రహదారిలో మద్యం షాపు సమీపాన రోడ్డులో తాతల కాలం నాటి రావి, వేప చెట్టు కూలిపోయింది. బొప్పాయి, టమోటా, బీన్స్ పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఉద్యానవన శాఖ అధికారులు స్పందించి రైతులకు జరిగిన నష్టానికి పరిహారం అందించాలని కోరుతున్నారు.

బాలాయపల్లి: అకాల వర్షంతో వరి రైతుకు నష్టం వాటిల్లింది. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్రజేయడంతో వర్షం కొంపముంచింది. వడ్లు రాశులలో తడవడంతో మద్దతు ధర పలకదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వరి పంట నేలకు ఒరిగిపోయింది. వ్యవసాయ అధికారులు స్పందించిన తడిచిన పంట కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.




వర్షాలకు వాలిపోయిన అరటి, టమోటా పంటలు

చెన్నయ్-గూడూరు సెక్షన్ రైల్వే లైన్ పరిధిలో...
'సబ్‌వే అండర్ పాస్' ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

చెన్నయ- గూడూరు సెక్షన్ పరిధిలోని రైల్వే లైన్ మధ్య రైళ్ల రాకపోకల వేగం గంటకు 110కిలోమీటర్ల నుంచి 130 కిలోమీటర్లకు పెంచిన నేపథ్యంలో మానవ సహిత లెవల్ క్రాసింగ్‌లను మూసేసి, ప్రత్యామ్నాయ సబ్‌వే అండర్‌పాస్ ఏర్పాటుపై చెన్నయ్ దక్షిణ మధ్య డివిజనల్ ఇంజినీర్ జంషీర్, జిల్లా ఆర్ అండ్ బి అధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శంకర్‌నారాయణతో కలిసి కలెక్టర్ ఛాంబర్లో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి సమీక్షించారు. దక్షిణ మధ్య డివిజనల్ ఇంజినీర్ కలెక్టర్‌కు వివరిస్తూ నాయుడుపేట విన్నమాల రైల్వే లెవెల్ క్రాసింగ్ నంబర్ 78, తడ మండల పరిధిలో పూడి ఎల్ సి నెంబర్ 48, సూళ్లూరుపేట పట్టణ పరిధిలోని ఎల్సి 60 లను మూసి వేస్తూ ప్రత్యామ్నాయ అండర్ పాస్ సబ్వే ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం సహకారం కావాలనీ జిల్లా కలెక్టర్ ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సబ్‌వే అండర్ పాస్ ఏర్పాటుకు ప్రజలకు అనుకూలంగా ఉండేలా ప్రతిపాదనలు, నిర్మాణ చర్యలు ఉండాలన్నారు. సూళ్లూరుపేట పట్టణంలోని మానవ సహిత ఎల్సి 60 మూసివేయుటకు సంబంధిత మున్సిపల్ కమిషనర్, ఆర్డిఓ సూళ్లూరుపేట, తాసిల్దారు రైల్వే అధికారులు సంయుక్త సర్వే నిర్వహించి అప్రోచ్ రహదారి, అండర్పాస్ ఏర్పాటు కొరకు అంచనాలు ప్రతిపాదనలు ప్రజలకు ఇబ్బంది కలిగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని, బాల్య వివాహాల నిరోధానికి పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ, మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టినట్లు బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జయలక్ష్మితో కలిసి కలెక్టర్‌ను లక్ష్మీదేవి కలిసారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి వరకు అవగాహన కల్పిస్తామన్నారు. బాల్య వివాహాల నిరోధానికి కటిన చర్యలు చేపడతామన్నారు. లక్ష్మీదేవి మాట్లాడుతూ పోక్సో చట్టం, బాల్య వివాహ నిరోదక చట్టంపై అవగాహన కల్పిస్తూ18 ఏళ్ల లోపు అమ్మాయిలకు పెళ్లిచేస్తే జరిగే శారీరక, మానసిక ఇబ్బందులను వివరించారు. గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయాలన్నారు. కరోనా వల్ల అనాధలుగా మారిన వారు ఎవరైనా ఉంటే దరఖాస్తులను పంపాలన్నారు. వారికి స్పాన్సర్షిప్ కింద నెలకు నాలుగువేలు వస్తుందన్నారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ డి.ప్రతిమ పాల్గొన్నారు.

జగనన్న లేఔట్‌లలో సిబ్బంది అందుబాటులో ఉండాలి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జగనన్న హౌసింగ్ లేఔట్‌లలో లబ్దిదారులకు అన్ని రకాల సమాచారం అందించేందుకు సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. ఏర్పేడు మండలం చిందేపల్లి జగనన్న కాలనీ ఇంటి నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఇంటి నిర్మాణాలు వేగంగా జరుగుతుండటం పట్ల లబ్దిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఒక్కో లేఔట్‌లో ఒక్కో రూమ్ తీసుకుని అందులో కంప్యూటర్ ఏర్పాటు చేసి, ఇంటర్నెట్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పూర్తయిన గృహాలకు పెయింటింగ్ పనులు త్వరగా చేయించాలని ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, హౌసింగ్ డిఇలు మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రాధాన్యతా క్రమంలో పనులు పూర్తి చేయాలి: మేయర్

నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ శిరీష ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులపై శుక్రవారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. వినాయకసాగర్, శ్రీనివాససేతు వంటి అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలన్నారు. ఎస్ఇ మోహన్, ఎంఇ చంద్రశేఖర్, స్మార్ట్‌సిటీ డిఇ మోహన్ పాల్గొన్నారు.

ఇంటిపన్నుపై వడ్డీ మాఫీ : కమిషనర్

ఇళ్లు, ఖాళీస్థలాల పన్నుపై వడ్డీ లేకుండా చెల్లించే సదవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. ప్రజలపై అధికభారం పడకుండా ప్రభుత్వం మార్చి 31లోపు ఇంటి, ఖాళీ స్థలాల పన్నుకు సంబంధించిన అరియర్, డిమాండ్‌ను ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మినహాయింపు ఉంటుందని తెలిపారు.

పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులకు రక్షణ ఉండాలి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ విభాగం ఆధ్వర్యంలో మహిళలపై లైగింక వేధింపులపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. స్థానిక శ్రీపద్మావతి ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న వారోత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన కార్యక్రమానికి డైరెక్టరు డాక్టరు వెంగమ్మ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని ప్రదేశాల్లో యజమాని బాధ్యతగల వ్యక్తిగా ఉండాలన్నారు. ఆ సంస్థల్లో లైంగిక వేధింపులు నిరోధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లైంగిక వేధింపులను నిషేదిస్తూ క్రమశిక్షణకు సంబంధించిన హక్కులు, చట్టాలు ప్రతి కార్యాలయంలో ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగినులు ప్రశాంతంగా పని చేసుకోవడానికి, వారికి తగిన రక్షణ కల్పించే వాతావరణాన్ని యాజమాన్యం తప్పక ఏర్పాటు చేయాలన్నారు. అడ్వకేట్ మమత మాట్లాడుతూ లైగింక వేధింపు అనేది ఉద్యోగిని ఇబ్బంది పెట్టే అవకాశం ఉన్న మాటలతో, శారీరకంగా వేధించే ప్రవర్తనను బట్టి, ఈవ్‌టీజింగ్, అవాంఛనీయ ఆహ్వానాలు, కార్యాలయం వెలుపల కలుసుకోవడం, ఒకరి ఇష్టానికి వ్యతిరేకంగా, వారి గోపత్యకు భంగం కల్గించడం లాంటివి చేయడం కూడా లైంగిక వేధింపుల చట్టం కిందకి వస్తాయన్నారు. ఈ చట్ట ప్రకారం అన్యాయానికి గురైన మహిళ వయస్సుతో నిమిత్తం లేకుండా పనిచేసే ప్రదేశంలోనైన, ఆమె ఉంటున్న నివాసంలో కాని లైంగిక వేధింపులకు గురైన వారికి, అలాగే ఏ వ్యక్తినైనా శాశ్వతంగా గాని, తాత్కాలికంగా గాని ఏదైన సంస్థలో పని చేసే వారికి ఎస్2ఎఫ్ అనే చట్టం ద్వారా లైంగిక వేధింపులకు గురి అయ్యేవారికి రక్షణ ఉంటుందన్నారు. డాక్టరు ప్రతిభ మాట్లాడుతూ మహిళల చట్టాలు, న్యాయపరమైన హక్కులు భారతదేశంలోని చట్టాలు, సెక్షన్లు, సమానత్వం తదితర అంశాల మీద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అనంతరం క్విజ్, వ్యాసరచన పోటీలు, సంగీత పోటీలు, తదితర పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజి ప్రొఫెసరు డాక్టరు వనజాక్షమ్మ, కాలేజి ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డాక్టరు కె.మాధవి, ఫ్యాకల్టీ ఆఫ్ నర్సింగ్ స్వర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమలలో క్లీన్ అండ్ జీరో ప్లాస్టిక్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుమల క్లీన్ అండ్ జీరో ప్లాస్టిక్‌గా ఉంచేందుకు కార్యనిర్వహణాధికారి ఎవి ధర్మారెడ్డి గొప్ప చొరవ చూపారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ జె.జయప్రకాష్ సాయి ఓ ప్రకటనలో తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానాలను సందర్శించిన ఆయన ప్రోటోకాల్ ర్యాంకు కేటాయించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల విద్య, సంక్షేమ పథకాలలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం బాగుంటుందన్నారు.



ఉపాధ్యాయ 'వైసిపి'కి..పట్టభద్రులు 'టిడిపి'కి..!

తూర్పు రాయలసీమలో ఎంఎల్‌సి ఫలితాల తీరు
ప్రభుత్వానికి పతనం ప్రారంభమయ్యింది : పీడీఎఫ్




తిరుపతిలో టీడీపీ సంబరాలు



తూర్పు రాయలసీమ పట్టభద్ర ఎంఎల్‌సి కౌంటింగ్ ప్రక్రియ ఇంకనూ కొనసాగుతూనే ఉంది. శనివారం పట్టభద్రుల ఎంఎల్‌సి ఎవరన్నది అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఉపాధ్యాయ స్థానాన్ని వైసిపి కైవసం చేసుకోగా, పట్టభద్రుల స్థానాన్ని టిడిపి అందిపుచ్చుకోనుంది. ప్రకాశం - నెల్లూరు - చిత్తూరు నియోజకవర్గ ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా వైసిపి తరపున బరిలో దిగిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపొందారు. అయితే కేవలం 1043 ఓట్ల స్వల్ప మెజార్టీతో విజేతగా నిలిచారు. ప్రభుత్వ టీచర్ల ఓటరు ఏమాత్రం ప్రలోభాలకు మొదటినుంచి చెక్కు చెదరలేదన్నది అర్థమవుతుంది. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై అధికార పార్టీ ఒత్తిడి తేవడం ద్వారా ఈ విజయాన్ని కైవసం చేసుకుందన్నది రాజకీయవర్గాల విశ్లేషణ. పిడిఎఫ్ ఉపాధ్యాయ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి నైతికంగా విజయం సాధించారని ఆయా శ్రేణుల నమ్మకం. ఇక పట్టభద్రుల కౌంటింగ్ పరిశీలిస్తే టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ చౌదరి భారీ మెజార్టీతోనే ఎంఎల్‌సిగా గెలుపొందనున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతోనే 27వేలకు పైగా మెజార్టీతో ముందంజలో ఉన్నారు. ఇక దొంగ ఓట్లను భారీగా చేర్పించి, రిగ్గింగ్‌కు పాల్పడిన వైఎస్ఆర్ కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంది. పిడిఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లో బరిలో నిలిచిన బిజెపి డిపాజిట్ సైతం కోల్పోయింది. ఇక స్వతంత్రులు చాలా స్వల్ప ఓట్లను దక్కించుకున్నారు. ఎంఎల్‌సి ఎన్నికల ఫలితాల తీరును పరిశీలిస్తే అధికార పార్టీ వైసిపికి చాలా స్వల్ప మెజార్టీనే దక్కింది. టిడిపి పట్టభద్రుల్లో ప్రభంజనంగానే దూసుకుపోయింది. పీడీఎఫ్ అభ్యర్థులు పొక్కిరెడ్డి బాబురెడ్డి గట్టి పోటీని ఇవ్వగా, మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. ఏదిఏమైనా పీడీఎఫ్ తాజా సిట్టింగ్ సీట్లను అధికార, ప్రతిపక్షాలు దక్కించుకున్నాయి.

పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపు

స్వల్ప తేడాతో పీడీఎఫ్ అభ్యర్థి బాబురెడ్డి ఓటమి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రకాశం - నెల్లూరు - తిరుపతి ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా వైసిపి తరపున పోటీ చేసిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపొందారు. శుక్రవారం తెల్లవారుజాము వరకూ గట్టి పోటీ ఇచ్చిన పీడీఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆర్‌విఎస్ లా కాలేజీ కౌంటింగ్ ప్రక్రియ జరిగిన మూట్‌కోర్టు హాలునందు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి డిక్లరేషన్‌ను శుక్రవారం అందించారు. 16న గురువారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై 17న తెల్లవారుజామున మూడు గంటల వరకూ కొనసాగింది. ఎలిమినేషన్ ఓటింగ్ ప్రక్రియతో తన సమీప అభ్యర్థి బాబురెడ్డి పొక్కిరెడ్డిపై 1043 ఓట్ల ఆధికత్యంతో చంద్రశేఖర్‌రెడ్డి పర్వతరెడ్డి గెలుపొందారు. ఎలిమినేషన్ కౌంటింగ్ ప్రాధాన్యతా ప్రక్రియ విధానంతో మొత్తం 24,291 ఓట్లకు గానూ చంద్రశేఖర్ రెడ్డి పర్వతరెడ్డి కి 11,714 ఓట్లు, బాబురెడ్డి పొక్కిరెడ్డి కి 10,671 ఓట్లు రాగా, 1906 ఓట్లు చెల్లని ఓట్లుగా నమోదయ్యాయని తెలిపారు. డిక్లరేషన్ అందించే కార్యక్రమంలో డిఆర్ఒ ఎన్.రాజశేఖర్ పాల్గొన్నారు.

పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బయోడేటా

పేరు : పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి
తండ్రిపేరు : పర్వతరెడ్డి సుందర రామిరెడ్డి
తల్లిపేరు : సుజాతమ్మ
స్వగ్రామం : చిల్లకూరు మండలం, వల్లివేడు గ్రామం, తిరుపతి జిల్లా
ప్రస్తుతం : రాంజీనగర్ మూడో వీధి, చిల్డ్రన్స్ పార్కు దగ్గర, నెల్లూరు
పుట్టిన తేదీ : 26-06-1972
విద్యార్హతలు : ఎంఎస్‌సి (మ్యాథ్స్)
విద్యార్థి దశ : 1987లో నెల్లూరు డిసిఆర్ జడ్పీ హైస్కూల్లో పదో తరగతి, 1989-92లో సర్వోదయ కళాశాలలో ఇంటర్, డిగ్రీ, 1994లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎమ్మెస్సీ, అనంతరం ఎంబీఏ పూర్తి చేశారు.
ప్రస్తుతం : చైర్మన్, శ్రీ కృష్ణ చైతన్య విద్యాసంస్థలు
సేవా కార్యక్రమాలు :తమ విద్యాసంస్థలో తక్కువ ఫీజుతో పేద విద్యార్థులకు విద్యను అందిస్తున్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్‌గా ఉన్నారు. కోవిడ్ సమయంలో విశేష సేవలను అందించారు. ఈ సేవలకు గుర్తింపుగా 2022, ఏప్రిల్‌లో అప్పటి రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ నుంచి బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డును అందుకున్నారు.

టిడిపికే 'పట్టం'...?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పట్టభద్రుల ఎన్నికల్లో ఎంఎల్‌సి స్థానాన్ని టిడిపి కైవసం చేసుకోనుంది. మొదటి కౌంటింగ్ పూర్తయ్యేసరికి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌చౌదరి భారీ మెజార్టీతో దూసుకుపోతున్నారు. ప్రకాశం- నెల్లూరు - చిత్తూరు పట్టభద్రులకు సంబంధించి బరిలో 22 మంది అభ్యర్థులు ఉన్నారు. 13న పోలింగ్, 15న రీపోలింగ్ పూర్తయిన నేపథ్యంలో 16న ఉదయం చిత్తూరు ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమయ్యింది. గురువారం సాయంత్రం వరకూ దాదాపు ఓట్లన్నీ బాక్సులు ఓపెన్ చేసి, కట్టలు కట్టడానికే సరిపోయింది. 40 టేబుళ్లలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ చౌదరి లీడ్‌లో ఉన్నారు. గెలుపుకు అవసరమైన ఓట్లు లేకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాయంత్రం నాలుగు గంటలపైన ప్రారంభమయ్యింది.

పోలైన మొత్తం ఓట్లు : 2,69,339
గెలుపుకు అవసరమైన ఓట్లు : 1,24,181
చెల్లిన ఓట్లు : 2,48,360 **చెల్లని ఓట్లు** : 20,979

1.	కంచర్ల శ్రీకాంత్ చౌదరి (టిడిపి)	: 1,12,514
2.	పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి (వైసిపి)	: 85,252
3.	సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి (బిజెపి)	: 6,341
4.	జైపాల్ అప్పంగారి (స్వతంత్ర)	: 287
5.	అంకయ్యచౌదరి మక్కెన (స్వతంత్ర)	: 89
6.	భాస్కర్‌రావు కమ్మిశెట్టి (స్వతంత్ర)	: 153
7.	కరుణానిధి చిరిపిరెడ్డి (స్వతంత్ర)	: 178
8.	కిరణ్ దాసరన్న (స్వతంత్ర)	: 126
9.	కొమ్ము యెహోను (స్వతంత్ర)	: 130
10.	గుల్లపల్లి వీరభద్రాచారి (స్వతంత్ర)	: 958
11.	దొడ్ల శ్రీహరి (స్వతంత్ర)	: 222
12.	నక్కా దినేష్ (స్వతంత్ర)	: 1,165
13.	నీలం సామ్యూల్ మోసెస్ (స్వతంత్ర)	: 964
14.	అభినవ్ విష్ణు (స్వతంత్ర)	: 107
15.	పూసల రావి (స్వతంత్ర)	: 290
16.	పతంగి పాలంకరెడ్డి (స్వతంత్ర)	: 91
17.	బుస్సా రాజేంద్ర (స్వతంత్ర)	: 533
18.	బొట్టికాయల చంద్రశేఖర్ (స్వతంత్ర)	: 84
19.	మహేందర్‌రెడ్డి (స్వతంత్ర)	: 58
20.	మాదసి జాలారావు (స్వతంత్ర)	: 334
21.	మీగడ వెంకటేశ్వరరెడ్డి (పిడిఎఫ్)	: 38,001
22.	అలివినేని సరిత (స్వతంత్ర)	: 483

సిబ్బందికి ఇబ్బందే..!

మూడు రోజుల పాటు హైరానా

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పోటీచేసిన అభ్యర్థులకేమో గానీ సిబ్బందికి మాత్రం 'కౌంటింగ్' చుక్కలు చూపించింది. ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ విధులంటేనే సిబ్బందికి హైరానా. ఐఎఎస్, ఐపిఎస్ అధికారి నుంచి పారిశుధ్య కార్మికుల వరకూ వాళ్ల కష్టాలు అన్నీఇన్నీ కావు. కుర్చీల్లోనే నిద్రపోవడం, అక్కడే వంటావార్పు. ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ 16వ తేదీ గురువారం ఉదయం ఆర్‌విఎస్ కళాశాలలో ఉంటుందని ముందే ఎన్నికల అధికారులు తెలియజేశారు. చిత్తూరులోనే రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, జడ్‌పి కార్యాలయ సిబ్బంది మొత్తం ఐదు రోజులుగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. లగేజీలతో సహా సర్దుకుని వచ్చేశారు. వారితో పాటు కౌంటింగ్ సిబ్బంది, అబ్జర్వర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, డిప్యూటీ కలెక్టర్లు, పోలీసులు మొత్తం జోడయ్యారు. 15వ తేదీ రాత్రి నుండే వాళ్లకు చుక్కలు కనిపించాయి. భద్రత విషయంలో పోలీసులు, కానిస్టేబుళ్లు, పారిశుధ్యం విషయంలో మున్సిపాలిటీ వారు, వంటావార్పు విషయంలో రెవెన్యూ అధికారులు, మెటీరియల్ అందించడంలో జడ్‌పి సిఇఒ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఇక్కడే ఉన్నారు. కౌంటింగ్‌కు వచ్చే సిబ్బంది మొత్తం మూడు రోజుల పాటు సిద్ధమై రావాలని చెప్పడంతో లగేజీ సర్దుకుని వచ్చేశారు. సహజంగా ఏ విధులకు వెళ్లినా రాత్రుల్లో విశ్రాంతి ఉంటుంది. అయితే ఎంఎల్‌సి కౌంటింగ్ విషయంలో మూడు పగళ్లు, మూడు రాత్రులు షిఫ్ట్‌ల వారీగా డ్యూటీలు చేస్తూ అలిసిపోయారు. టీచర్ల కౌంటింగ్ శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటలకు ముగిసింది. ఐదు గంటలకు ఆ సిబ్బంది ఇళ్లకు బయల్దేరడానికి సిద్ధమయ్యారు. అయితే పట్టభద్రుల ఓట్లు ఎక్కువగా ఉన్నాయని, భాగస్వామ్యం కావాలని రిటర్నింగ్ అధికారి ఆదేశించడంతో ఉసూరుమంటూ కూర్చున్నారు. ఏ కౌంటింగ్ సిబ్బంది మొహం చూసినా, కానిస్టేబుళ్ల మొహం చూసినా అలసట స్పష్టంగా కనిపిస్తోంది. వీరితో పాటు ఏజెంట్లు, ఆయా అభ్యర్థులు, మీడియా సైతం మూడు రోజుల పాటు ఆ కళాశాల వద్దనే తిష్టవేసుకుని ఉండాల్సిన గత్యంతరం లేని పరిస్థితి.



రోడ్డు పక్కనే నిరీక్షణ

చెల్లని ఓట్లే అధికం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అందరూ మేధావులే.. విద్యావంతులే.. అయినా ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో చెల్లని ఓట్లు వేలల్లో ఉండటం గమనార్హం. రెండు మూడు వేలు కాదు, ఏకంగా ఉపాధ్యాయ, పట్టభద్రులు అన్నీ కలిపి 21,144 ఓట్లు. టీచర్స్ ఎన్నికల్లో 435 ఓట్లు చెల్లనివిగా ఉన్నాయి. ఏవిధంగా చెల్లకుండా పోయాయంటే.. నచ్చిన అభ్యర్థికి టిక్ పెట్టడం, ఇంటూ పెట్టడం చేశారు. ఒకటి వేసి 'ఫస్ట్' అని ఇంగ్లీష్‌లో రాయడం.. ఇంకుతో వేలిముద్రలు వేయడం జరిగాయి. గతంలో ఉపాధ్యాయ ఎన్నికల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులే ఓటు వేసేవారు. అప్పట్లో చెల్లని ఓట్లు పదుల సంఖ్యలోనే ఉండేవి. ఈసారి అధికార పార్టీ ఓట్ల కోసం ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న వారికి ఓటు హక్కు కల్పించడంతో ఎక్కువగా చెల్లని ఓట్లు వచ్చాయని చర్చ నడుస్తోంది.

ఇక పట్టభద్రుల విషయానికి వస్తే నవ్వుకోక తప్పదు. 20,979 ఓట్లు చెల్లకుండా పోయాయి. మీడియా ఏజెంట్లను ఆరా తీయగా 80 శాతం ఓట్లు వైసిపికి పడినవే చెల్లకుండా పోయాయని చెప్పడం గమనార్హం. వేలిముద్రలు, ఇంటూ పెట్టడం, టిక్ కొట్టడం, నా ఓటు శ్యాంప్రసాద్‌రెడ్డికే అని ఎదురుగా రాయడం ఇలా చిత్ర విచిత్రాలుగా ఉన్నాయి. డిగ్రీలు పూర్తికాని నిరక్షరాస్యులను ఓటర్లుగా తీసుకురావడం వల్లనే ఇన్ని ఓట్లు చెల్లకుండా పోయాయని తెలుస్తోంది. గెలిచిన అభ్యర్థి ఎంత మెజార్టీతో ఉన్నారో, దగ్గరదగ్గర చెల్లని ఓట్లూ అన్నే ఉండటం గమనార్హం.

వైసిపి పతనం ఆరంభం : సిఐటియు

తిరుపతి టౌన్ : ప్రజలతో ఘర్షణ పెట్టుకుని ప్రజా వ్యతిరేకంగా తయారైన వైసిపి ప్రభుత్వ పతనం ప్రారంభమయ్యిందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో విమర్శించారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థుల ఓటమే దీనికి సూచికని పేర్కొన్నారు. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన సాధారణ వ్యక్తులను సైతం టీచర్ ఓటర్లుగా నమోదు చేసి ఎన్నికల్లో లబ్ది పొందేందుకు ప్రయత్నించిందని, ఓటరుకు ఐదు నుంచి పదివేల రూపాయలు పంచిపెట్టి తప్పుడు వ్యవహారానికి పాల్పడ్డారన్నారు. ఈ కారణంగానే పీడీఎఫ్ అభ్యర్థులు ఎన్నికల్లో హోరాహోరీగా పోరాడి అపజయాన్ని చవిచూశారన్నారు. పీడీఎఫ్ అభ్యర్థులు నైతిక విజయం సాధించారని పేర్కొన్నారు. ఉద్యోగ కార్మికుల సమస్యల పరిష్కారంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అప్రజాస్వామికంగా ఉందన్నారు.

పిల్లలందరికీ ఆధార్ నమోదు తప్పనిసరి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలందరికీ ఆధార్ నమోదు తప్పనిసరి అని.. అంగన్‌వాడీ కార్యకర్తలు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి సూచించారు. శుక్రవారం పుత్తూరు మండలం తడుకు అంగన్‌వాడీ పాఠశాలలో సెగ్మెంట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌డీజీ సర్వే వెంటనే పూర్తి చేయాలని.. అంగన్వాడీ కార్యకర్తలందరూ తమ పరిధిలోని లబ్ధిదారులందరికీ నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీ చైతన్య, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా దంత వైద్యసేవలు



ప్రజాశక్తి-వరదయ్యపాలెం: శ్రీసిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శ్రీసిటీలోని కేర్ ఇంటర్నేషనల్ డెంటల్ సెంటర్, కోల్గేట్ పామోలివ్ పరిశ్రమ సహకారంతో శ్రీసిటీ ఫౌండేషన్ వారు దంత సమస్యలపై శుక్రవారం అవగాహన కల్పించారు. అలాగే ఉచిత ంగా దంత వైద్యసేవలు అందించారు. శ్రీహరికోట కాలనీ, తొండూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు చెందిన సుమారు 45 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి నోటి పరిశుభ్రతపై సూచనలు చేశారు. పారామెడికల్ సిబ్బంది సహాయంతో డాక్టర్ మెటిల్డా విద్యార్థులకు సమగ్ర దంత పరీక్షలు నిర్వహించారు. కోల్గేట్ పామోలివ్ పరిశ్రమ ఆధ్వర్యంలో విద్యార్థులందరికీ డెంటల్ కేర్ కిట్‌లను సరఫరా చేశారు. కార్యక్రమంలో కేర్ ఇంటర్నేషనల్ డెంటల్ సెంటర్ వైద్యులు స్వరూప్ కుమార్ రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

31 లోపు పన్ను బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-నాయుడుపేట: ఈనెల 31వ తేదీలోపు ఎలాంటి అదనపు రుసుములు లేకుండా పన్ను బకాయిలు చెల్లించాలని నాయుడుపేట పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలోని ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు ఈనెల 31వ తేదీ లోపు చెల్లించాలని సూచించారు. ప్రతిఒక్కరూ విధిగా పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. పన్నులు సకాలంలో చెల్లించలేని వారి కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గూడూరు: ఆస్తి, ఖాళీ స్థలాలపై పన్ను బకాయిలు ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామని పురపాలక శాఖ కమిషనర్ సాయినాథ్ అన్నారు. గూడూరు పట్టణంలోని పురపాలక కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి పన్ను బకాయిలున్న వారు ఈ నెలాఖరులోగా మొత్తాన్ని చెల్లించాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

పుత్తూరు టౌన్: పట్టణంలోని పురపాలక సంఘం పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాలకు పన్ను ఈనెల 31లోపు చెల్లిస్తే వడ్డీ మాఫీ చేయబడుతుందని పుత్తూరు పురపాలక కమిషనర్ కేఎల్‌ఎంఎన్ రెడ్డి తెలిపారు.

కొండలరావుకు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయ, సమాచార శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థి బత్తల కొండలరావుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎం.దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని గ్రంథాలయ, సమాచార శాస్త్ర విభాగంలో డాక్టర్ కొంగర సురేంద్ర బాబు పర్యవేక్షణలో బతల కొండల రావు "ఇన్ఫర్మేషన్ నీడ్స్ ఆఫ్ ఫిషర్మెన్ ఇన్ కోస్టల్ ఏరియా ఆఫ్ ఆంధ్రప్రదేశ్: ఏ స్టడీ" అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించినట్లు వెల్లడించారు. కొండలరావు పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్‌లలో అనేక పరిశోధన వ్యాసాలను ప్రచురించినట్లు వివరించారు. కొండలరావుకు డాక్టరేట్ అవార్డు రావడంపై ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

స్టిక్కర్ల కోసం వందల కోట్లా..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర బడ్జెట్‌లో ఇళ్లకు, సెల్ ఫోన్లకు స్టిక్కర్లు వేసేందుకు, గడప గడపకు ప్రభుత్వం అనే స్కీమ్ పెట్టి రూ.532 కోట్లు ప్రతిపాదించడం విడ్డూరంగా ఉందని, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ శుక్రవారం విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌ను రూ. 2.79 లక్షల కోట్లు అని చూపిస్తున్నారని, ఇందులో అప్పులు, కేంద్ర సాయం, కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాలే రూ. 1.61 లక్షల కోట్లు ఉందని గుర్తించాలన్నారు.

పేదలకు యువత అన్నదానం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: కన్నడ సినీ హీరో పునీత్‌రాజ్ జయంతి సందర్భంగా పుత్తూరులోని స్టార్ స్టూడియో నిర్వాహకులు టీఎస్ భూపతి ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. పునీత్ రాజ్ పేదవారికి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని ఆయన మృతి బాధాకరమన్నారు. ఆయన జ్ఞాపకార్థం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పునీత్‌కుమార్ అభిమానులు ప్రవీణ్, సన్నీ, మహేష్, మోసెస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ర్యాలీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా స్విమ్స్ బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. స్విమ్స్ ఆవరణం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఎన్‌టిఆర్ విగ్రహం, ఫిజియోథెరఫి కాలేజీ, నర్సింగ్ కళాశాల, ఆయుర్వేద ఆసుపత్రి మీదగా వాల్మీకి సర్కిల్ వరకు సాగింది. ఈ సందర్భంగా బయోకెమిస్ట్రీ విభాగం ప్రొఫెసరు డాక్టరు ఎంఎం సుచిత్ర మాట్లాడుతూ మనిషి శారీరకంగానూ, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే తమ పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు మంచి ఆహార నియమాలు అలవరుచుకోవాలని సూచించారు. సమయానుసారం నిద్రపోవటం, ఆహారం తీసుకోవడం, ప్రతి రోజూ వ్యాయమం చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. ఇలాంటివి చేయడం వల్ల మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవచ్చన్నారు. ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబిబిఎస్, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ఫిజియోథెరపి, అల్లైడ్ సైన్సెస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనం







ప్రజాశక్తి-కోట : రాష్ట్రంలో ఇటీవల జరిగిన పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ఫలితాలలో టీడీపీ విజయాన్ని సాధిస్తోందని.. వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ పతనానికి శ్రీకారమని ఆ పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు.

కోట: కోట మండలంలోని టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో కంచర్ల శ్రీకాంత్ అత్యధిక మెజారిటీతో గెలుపొందడంతో మండల పరిధిలోని టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. విద్యానగర్ గాంధీ విగ్రహం వద్ద సీనియర్ టీడీపీ నాయకులు వాకా విజయభాస్కర్ రెడ్డి, పల్లెమల్లు వెంకటకష్ణారెడ్డి ఆధ్వర్యంలో భారీగా బాణసంచా పేల్చి పలువురికి మిఠాయిలు పంచి పెట్టారు. చిట్టెడు పంచాయతీ పరిధిలో టీడీపీ నాయకులు యాకసిరి చిన్నయ్య ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిట్టేడు టీడీపీ నాయకులు వెంకట రమణయ్య, రాజా, నరసింహులు, తులసి, వెంకటేశ్వరు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుతో వైసీపీకి సమాధి

తిరుపతి టౌన్: తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు, కార్పొరేషన్ ఎన్నికల్లో అవినీతి అరాచక ఆగడాలకు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే చెంపపెట్టు అని.. ఈ రాష్ట్రంలో చంద్రబాబు లాంటి సమర్థుల పాలనే ప్రజలు కోరుకుంటున్నారని కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వూకా విజయ్ కుమార్ వెల్లడించారు. అవినీతి అరాచకాలపై పునాదులు వేసుకున్న అధికార వైసీపీకి రాష్ట్రంలో ఇక నూకలు చెల్లాయని పేర్కొన్నారు. కంచర్ల శ్రీకాంత్ విజయం సాధించిన సందర్భంగా తిరుపతి ఎన్టీఆర్ సర్కిల్ వద్ద శు క్రవారం సాయంత్రం టీడీపీ శ్రేణులు భారీ సంబరాలు జరుపుకున్నారు. నాయకులు శ్రీనివాస్, మన్నెం శ్రీనివాస్, ఆముదాల తులసీ, రవిశంకర్ యాదవ్, జే బీ రఘు, గదం బాబు, రజనీకాంత్, కరాటే చంద్ర, రాజయ్య, లత, అనిత, భారతి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చా టూరు: తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ స్థానంలో టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ ఆధిక్యం వైసీపీ నిరంకుశ వైఖరికి నిదర్శనమని పిచ్చాటూరు క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇళంగోవన్‌రెడ్డి అన్నారు. పిచ్చాటూరు టీడీపీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వచ్చి టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పద్దురాజు, జయచంద్రనాయుడు, వైస్ సర్పంచ్ రవి, వాసు, శ్రీనివాసులు, త్యాగరాజు, దొరవేలు, మణికంఠ తదితర నాయకులు పాల్గొన్నారు.

వరదయ్యపాలెం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కంచర్ల శ్రీకాంత్ అత్యధిక మెజారిటీతో గెలుపొందడంతో మండల పరిధిలోని టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బస్టాండ్ అవరణలో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచి పెట్టారు. నాయకులు నిర్మల్, శివయ్య, సురేష్ రెడ్డి, మల్లీ, హరి చౌదరి, పథ్వి, కుమార్ నాయుడు, అజీజ్, మునిభూషణమ్మ, శివ కుమార్ పాల్గొన్నారు.


డక్కిలి: మండలంలోని టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో కంచర్ల శ్రీకాంత్ అత్యధిక మెజారిటీతో గెలుపొందడంతో మండల పరిధిలోని టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. నాయకులు రామచంద్రనాయుడు, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో విజయోత్సవ సంబరాలు

క్యాంపస్: రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలపై టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నేతలు కేకులు కట్ చేసి వర్సిటీ ప్రధాన గ్రంథాలయం ఎదుట విజయోత్సవ సంబరాలను జరుపుకున్నారు. శ్రీవెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.







'ఇన్ఫోరియం' సదస్సుతో విద్యార్థులకు సహకారం

ప్రజాశక్తి - కోట: 'ఇన్ఫోరియం' సదస్సుతో విద్యార్థుల భవిష్యత్తుకు మంచి అవకాశమని.. ఇలాంటి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం కోట మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ లో ఇన్ఫోరియం -2క23 సాంకేతిక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ అప్పిని నారాయణరావు మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల కారణంగా ఉద్యోగాల ఇంటర్వ్యూలలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. సదస్సు కోఆర్డినేటర్ శివప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సదస్సులో రాష్ట్రంలోని నలుమూలల నుంచి విద్యార్థులు హాజరయ్యారని.. వివిధ కార్యక్రమాలపై ప్రత్యేక శిక్షణ



అందించనున్నట్లు తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకోవడానికి మంచి అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణారెడ్డి శ్రీచైతన్య చిల్డ్రన్స్ అకాడమీ వార్షికోత్సవం


ప్రజాశక్తి-తిరుపతి సిటీ: విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలకపాత్ర పోషించాలని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు డిపార్ట్మెంట్ మధు జ్యోతి అన్నారు. తిరుపతి నగరంలోని స్థానిక మహతి ఆడిటోరియంలో బీవీకే గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో కృష్ణారెడ్డి శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ వార్షికోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆమె మాట్లాడుతూ విద్యాలయాలన్ని ఒక కుటుంబంగా చూసుకోవడం చాలా సంతోషకరమన్నారు. జీవితంలో విజయం సాధించాలంటే విద్యార్థులు చిన్నప్పటి నుంచే కషి చేయాలని సూచించారు. వైస్ ఛైర్మన్ పార్థివ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే భక్తిశ్రద్ధలతో విద్యను అభ్యసించాలని ప్రతిఒక్క విద్యార్థి ఉన్నత చదువులు చదివి గొప్ప స్థాయిలో ఉండాలని కోరుకున్నారు. పాఠశాల



సీఈవో అలేఖ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో నాణ్యమైన విలువలతో కూడిన విద్యను అందించడమే కాకుండా దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందన్న మాటకు సజీవ సాక్ష్యంగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షులు అరుణ, ప్రిన్సిపాళ్లు ఎన్ హరిబాబు, కే జనార్ధన్, శారద, మమత, సురేష్, కిషోర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' పై అవగాహన

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం సావేరి సెమినార్ హాల్‌లో 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' పై అవగాహన సదస్సును నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజని ముఖ్య అతిథిగా పాల్గొని క్యాంపస్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న సినర్జీలపై ప్రస్తావించారు. వాటిని ఉపయోగించుకునేలా వారిని ప్రోత్సహించారు. విజయం సాధించిన తర్వాత ఓ మహిళ తన జీవితాన్ని ఎలా మార్చుకోవాలో వివరించారు. ఆచార్య జె.కాత్యాయని నైపుణ్యాలను విశ్లేషించడం, కృత్రిమ మేధస్సు ప్రాముఖ్యతను వివరించారు. టీడీఐ సీఈవో సూర్యకుమార్ పలు సూచనలు చేశారు. స్టేట్ బ్యాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెర్నింగ్ చీఫ్ మేనేజర్ జ్యోతి శారద



కష్టమర్లతో తన అనుభవాలను పంచుకున్నారు. స్టేట్ బ్యాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ చీఫ్ మేనేజర్ ప్రతాప్ కుమార్ తిరుమలశెట్టి ప్రభుత్వ సహకారంతో తాము అందిస్తున్న ఆర్థిక వనరుల గురించి వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ మురళి, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పుష్పయాగానికి అంకురార్పణ

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మార్చి 18న జరుగనున్న పుష్పయాగానికి శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. సాయంత్రం 6 నుంచి పుణ్యాహవచనం, మత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం చేపట్టారు. మార్చి 18న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పుష్పయాగం జరుగనుంది. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గురుమూర్తి, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్వీయూ మైక్రోబయాలజీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సులో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మైక్రో బయాలజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని మైక్రోబయాలజీ విభాగం అధ్యక్షులు ప్రొఫెసర్ సి.హెచ్.పరమగీతం తెలిపారు. ఈ జాతీయ సదస్సు " రీసెంట్ అడ్వాన్స్‌ఎస్ ఇన్ మైక్రోబియల్ టెక్నాలజీ అండ్ అలైడ్ సైన్సెస్" అనే అంశంపై జరిగిన సదస్సులో పైనాపిల్ ఫలాల వ్యర్థాల నుంచి ఎరువుని తయారు చేసే విధానాన్ని పోస్టర్ ప్రజెంటేషన్ చేసినందుకు సదస్సు నిర్వాహకులు ఉత్తమ పోస్టర్ గా ఎంపిక



చేయడం జరిగింది. ఈ పోస్టర్ ప్రజెంటేషన్ లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మైక్రోబయాలజీ విద్యార్థులు సాధక్ వల్లి, సాయిపవన్, సుబ్బారెడ్డి, ప్రీతి, హరిచందన ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను మైక్రోబయాలజీ విభాగం అధ్యక్షులు ప్రొఫెసర్ సిహెచ్. పరమగీతం విద్యార్థులను అభినందించారు.

నేడు అన్నమాచార్యుని వర్ధంతి

ప్రజాశక్తి-క్యాంపస్: సంకీర్తన ఆచార్యులు శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 520 వ వర్ధంతి శ్రీ వేంకటేశ్వర సంగీత, నత్య కళాశాలలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో శనివారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ప్రారంభమవుతుందని కళాశాల ప్రిన్సిపల్ ఉమా ముద్దుబాల తెలిపారు. కార్యక్రమంలో నగరంలోని సంగీత విద్వాంసులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

పొయ్యలో వైద్య పరీక్షలు




ప్రజాశక్తి-తొట్టంబేడు: మండలంలోని పొయ్య దళితవాడలో విష జ్వరాలు ప్రబలి ప్రజలు అనా రోగ్యానికి గురవ ుతున్నారని సమాచారాన్ని తెలుసుకున్న తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ తేజేశ్వరి తన సిబ్బందితో కలిసి శు క్రవారం ఇంటింటికీ తిరిగి గ్రామంలో వైద్య సేవలు అందించారు. మొత్తం124 గహాలలో 392 మంది ఉన్నారని, వీరిలో ఐదుగురు మాత్రం జ్వరంతో బాధపడుతున్నారని తెలిపారు. తాగునీరు కలుషితమై వస్తున్నాయని కొందరు గ్రామస్థులు తెలిపారని..దీంతో తాగునీటి కుళాయిల వద్ద శాంపిల్స్ సేకరించి తిరుపతిలోని ప్రజారోగ్యశాఖకు చెందిన ల్యాబ్ కు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సంపూర్ణ, ఉఎఎన్‌ఎం బుజ్జమ్మ, ఢిల్లీ రాణి, లిఖిత్ కుమార్, శిరీష, ఇందువదన, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరామలో జాతీయ సాంకేతిక సదస్సు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడీ మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆవిష్కర్-2023 పేరుతో జాతీయ సాంకేతిక సదస్సుని నిర్వహించారు. ఈ సదస్సుకి వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని వారిలో ఉన్న సజనాత్మకను వివిధ అంశాల మీద ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తిరుపతి ఐఐటి ప్రొఫెసర్ డాక్టర్ వై.కాళిదాసు హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంకేతికంగా కూడా అభివద్ధి చెందాలన్నారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న టాలెంట్ ని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల ఎల్లప్పుడూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసే కార్యక్రమాలను నిర్విరామంగా కొనసాగిస్తుందన్నారు. ప్రదర్శనలో వేము కాలేజ్, విద్యానికేతన్ కాలేజ్, ఎన్ బికెర్ విద్యార్థులు, శ్రీరామ విద్యార్థులు వివిధ కళాశాల విద్యార్థులు గెలుపొందారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, కన్వీనర్ డాక్టర్ ఎం. హేమలత, కళాశాల విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



తిరుమల : తిరుమలకు వచ్చే సామాన్య భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించాలని, వందల కిలోమీటర్ల పాద యాత్రగా వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత టిటిడిపై ఉందని టిడిపి ఎంఎల్‌ఎ బుచ్చయ్యచౌదరి అన్నారు. విఐపి ప్రారంభ విరామ దర్శన సమయంలో తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. పార్టీ బలోపేతం, కార్యకర్తల్లో ధైర్యం నింపేందుకే లోకేష్ పాదయాత్ర చేస్తున్నారన్నారు. ప్రతిపక్షంగా నిర్ణయాత్మకమైన సూచనలు ఇస్తామని, దాన్నిఇ బాధ్యతగా ప్రతిపక్షాలను గౌరవించి ముందుకెళ్లాలని, అపుడే ప్రభుత్వ మనుగడ సాగుతుందన్నారు.

అక్రమాలకు పాల్పడితే వేటు



ప్రజాశక్తి-బాలాయపల్లి: ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే వేటు తప్పదని ఎంపీడీవో స్వరూప రాణి అన్నారు. మండలంలోని మన్నూరు గ్రామంలో ఉపాధి పనులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనులకు రాకుండా ఇళ్ల వద్దే ఉంటూ మస్టర్లలో పేర్లను నమోదు చేసుకుంటూ ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నట్లు తమ దష్టికి వస్తే వెంటనే క్రిమినల్ కేసులు పెడుతామని హెచ్చరించారు. ఎక్కడైతే పనులు మంజూరయ్యాయో ఆ ప్రదేశాల్లోనే పనులు నిర్వహించాలని సూచించారు. అలాగే సచివాలయాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమం కోసం సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నారా లోకేష్ పాదయాత్రకు వీడ్కోలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 45 రోజుల పాటు చేపట్టిన నారా లోకేష్ యువగళం పాదయాత్రకు నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ ఘనంగా వీడ్కోలు పలికారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో యువగళం పాదయాత్ర దిగ్విజయంగా పూర్తవడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనతోపాటు పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షులు జీవరత్నం నాయుడు, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులునాయుడు, జిల్లా పంచాయతీ ఛాంబర్ అధ్యక్షుడు ధనంజయయాదవ్, విజయపురం మండల ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, పుత్తూరు రూరల్ మాజీ అధ్యక్షుడు కరుణయాదవ్, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, నగరి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు జి.బాబు, జి.గోపీనాథ్, ఈశ్వర్ యాదవ్, కపిల్, వెంకటేష్ ప్రసాద్, శరత్, దాము, సామ్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

చీటీల నిర్వాహకుడు మురళీ అరెస్టు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరులో గత 20 సంవత్సరాలుగా ఎలాంటి అనుమతులు లేకుండా చీటీలు నిర్వహించిన మురళీపై పుత్తూరు పట్టణానికి చెందిన జయంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మహిళ వద్ద సుమారు రూ.27 లక్షలకు పైగా చీటీలు కట్టించుకొని డబ్బులు ఇవ్వకుండా మోసం చేయడంతో అరెస్టుచేసి శుక్రవారం రిమాండుకు పంపినట్లు పేర్కొన్నారు. పుత్తూరులో అనుమతి లేకుండా ఎవరైనా చీటీలు నిర్వహించినా, ఫైనాన్స్‌లు ఇస్తూ ఇబ్బందులు పెట్టినా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

'తిరుపతిలో కులచిచ్చులు పెట్టొద్దు'



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో అధికార వైసీపీ నాడు బ్రిటిషర్లు పాటించిన విభజించు పాలించు అనే సూత్రాన్ని అమలు చేస్తోందని, తిరుపతిలో కుల శిక్షలు పెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న తిరుపతి నగరంలో కులచిచ్చులు పెట్టి వేడుక చూడాలని వైసిపి భావిస్తోందన్నారు. ప్రతి కులానికి రాజకీయ ప్రాధాన్యత ఉండాలని ఉద్దేశంతో పవన్ కళ్యాణ్ బీసీ, ఎస్సీ సదస్సులను నిర్వహించారన్నారు. తిరుపతి పట్టణ అధ్యక్షులు రాజారెడ్డి , జనసేన పార్టీ తిరుపతి పట్టణ ఉపాధ్యక్షులు బాబ్జి, కృష్ణయ్య, రాజేష్, యాదవ్, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నంది సర్కిల్‌ను ఢీకొన్న టిప్పర్

ప్రజాశక్తి-తొట్టంబేడు: బసవయ్యపాలెం బైపాస్ రోడ్డులో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొత్తగా నంది సర్కిల్ ను ప్రారంభించారు. మెగా కంపెనీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ రహదార పనులకు గ్రావెల్‌ను తరలిస్తున్న ఓ టిప్పర్ డ్రైవర్ మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ నంది సర్కిల్‌ను ఢీకొన్నాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ముత్యాలమ్మ జాతర విజయవంతం

ప్రజాశక్తి-చిల్లకూరు: తూర్పు కనుమూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారి జాతర శుక్రవారం ముగిసింది. కార్యనిర్వహణ అధికారి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో జాతర విజయవంతంగా నిర్వహించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ దశరథ రామారావు పర్యవేక్షించారు.